


సొంతింటి కల నెరవేరుతోంది

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల సొంతింటి కల నెరవేరుతోందని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు.

- 8లో ▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
సోమ : 6:32	మంగళ : 5:00

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 38.9 /18.8

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఘనంగా ధ్వజారోహణం



పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

భిక్కనూరు: దక్షిణ కాశీగా పేరొందిన భిక్కనూరు శ్రీసిద్ధరామేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. రెండో రోజు ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అలంకరించిన ఎడ్ల బండ్లతో పట్టణంలో శోభాయాత్ర నిర్వహించి, ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. ఆలయ పూజారి రామగిరిశర్మ ఆధ్వర్యంలో పూజాదులు కొనసాగుతున్నాయి.

ఫోర్జరీ వ్యవహారంలో నలుగురిపై కేసు

దోమకొండ: దోమకొండ గ్రామపంచాయతీ కార్యదర్శి సంతకాలను ఫోర్జరీ చేసిన వ్యవహారంలో గ్రామానికి చెందిన నలుగురిపై ఆదివారం కేసులు నమోదు చేసినట్లు ఎస్సై స్రవంతి తెలిపారు. ఈ కేసులో దోమకొండకు చెందిన చింతల రవీందర్‌ను మొదటి నేరస్తుడిగా గుర్తించామని, అతడి వద్దనుంచి నకిలీ రసీదు బుక్కులను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. రెండో నేరస్తుడిగా గ్రామానికి చెందిన మన్నె శ్యామ్‌రెడ్డిని గుర్తించామని తెలిపారు. అతడి వద్దనున్న పంచాయతీ కార్యదర్శి నకిలీ స్టాంపు, రౌండ్ సీల్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామానికి చెందిన మంగళపల్లి శ్రావణ్‌ను ఈ కేసులో మూడో నేరస్తుడిగా గుర్తించామని పేర్కొన్నారు. అతడు పంచాయతీ కార్యదర్శి నకిలీ స్టాంపులను ఉపయోగించి తన పెద్దమ్మ మంగళపల్లి రాజమణి బంగారాన్ని ఆమెకు తెలియకుండా కామారెడ్డిలోని మణప్పురం గోల్డ్ ఫైనాన్స్‌లోనుంచి విడిపించాడన్నారు. కామారెడ్డికి చెందిన దొంతుల కృష్ణ అనే వ్యక్తి నకిలీ స్టాంపులను తయారుచేసి ఇచ్చినట్లు గుర్తించి, అతడిని కేసులో నాలుగో నేరస్తుడిగా నమోదు చేశామన్నారు. కేసులో మొదటి నేరస్తుడైన చింతల రవీందర్ కోర్టు కేసులు, పోలీస్ కేసులలో జమానత్ పత్రాల కోసం దోమకొండ గ్రామపంచాయతీ నకిలీ రసీదు బుక్కులతో పాటు పంచాయతీ కార్యదర్శి సంతకాలను ఫోర్జరీ చేసినట్లు విచారణలో తేలిందన్నారు. నలుగురినీ రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు.

వలకు చిక్కిన మొసలి



మొసలిని చూపుతున్న జాలరి

బాల్కొండ: చేపలు పట్టేందుకు జాలర్లు వేసిన వలకు మొసలి చిక్కిన ఘటన మెండోరా మండలం వెల్కటూర్ గ్రామ శివారులోని ఎల్లమ్మ చెరువులో ఆదివారం చోటు చేసుకుంది. కాకతీయ కాలువ పక్కనే ఉండడంతో మొసలి చెరువులోకి వచ్చి ఉంటుందని జాలర్లు భావిస్తున్నారు. వలకు చిక్కిన మొసలిని ఒడ్డుకు చేర్చి ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు. చెరువుల్లో మొసళ్లు కనిపిస్తుండడంతో చేపలు వేటాడేందుకు జాలర్లు జంకుతున్నారు.



గోపాల్‌పేట ఎస్సీ కాలనీలో నల్లా వద్ద బిందెలు, బకెట్లతో మహిళల నిరీక్షణ



కిలోమీటరు దూరంనుంచి నీటిని తెచ్చుకుంటున్న పెద్దకొడప్‌గల్ మండలంలోని మనిసిరాం తండావాసులు

గొంతు తడిసేదెలా?

- ముదురుతున్న ఎండలు.. ఎత్తిపోతున్న బోర్లు
- సక్రమంగా సరఫరా కాని 'భగీరథ' నీళ్లు
- తాగునీటి కోసం గోసపడుతున్న ప్రజలు

వేసవి ప్రారంభంలోనే ఎండలు మండుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో బోరుబావులు ఎత్తిపోతున్నాయి. మరోవైపు మిషన్ భగీరథ నీళ్లు సక్రమంగా సరఫరా కావడం లేదు. అప్పుడప్పుడు వస్తున్న నీళ్లు దాహార్తి తీర్చలేకపోతున్నాయి. సర్కారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో తాగునీటి సమస్యలపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్..

– సాక్షి నెట్‌వర్క్

జిల్లాలో నీటి కష్టాలు మొదలయ్యాయి. పల్లె, పట్నం తేడా లేకుండా అంతటా తాగునీటి కోసం మైళ్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో నీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. మిషన్ భగీరథ నీరు చాలా గ్రామాలకు సరఫరా కావడం లేదు. కొన్నిచోట్ల నాలుగైదు రోజులకోసారి కూడా రావడం లేదు. వచ్చిన నీరు అందరికీ అందడం లేదు. ఇంకొన్ని చోట్ల ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయి. మరోవైపు భూగర్భ జలమట్టం పడిపోయి బోర్లు కూడా ఎత్తిపోతున్నాయి. పంచాయతీ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తారనుకుంటే.. ఖజానా ఖాళీగా ఉందని, ట్రాక్టర్లను నడిపేందుకు డీజిల్ ఎక్కడినుంచి తెచ్చిపోయాలని పంచాయతీ కార్యదర్శులు చేతులెత్తేస్తున్నారు. ఇంటింటికి నల్లా ద్వారా నీరు సరఫరా కాకపోవడంతో కొన్ని గ్రామాల్లో పంచాయతీ బోర్ల వద్ద నుంచి మోసుకువెళ్తున్నారు. ఇంకొన్నిచోట్ల పొలాల వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తోంది.

పల్లెలు, తండాల్లో నీటి కష్టాలు...

గాంధారి మండలంలోని సోమ్లానాయక్ తండా, కర్ణంగడ్డతండా, గుడిముందు తండా, జెమినితండా, డప్పు తండాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉంది. వ్యవసాయ బావుల వద్ద నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. ఎల్లారెడ్డి మండలంలోని సోమర్యాగడి తండాలో నీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేట ఎస్సీ కాలనీ, బద్యానాయక్ తండాల్లో నీటి కష్టాలు పెరిగాయి. రామారెడ్డి మండల కేంద్రంతో పాటు మొండివీరన్నతండా, సున్నపురాళ్ల తండాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉంది. తాడ్వాయి మండలం బ్రాహ్మణపల్లి ఎస్సీ కాలనీలో నీటి సమస్య ఉంది. లింగంపేట మండలంలోని పర్మల్ల గ్రామంలో నీటికి ఇబ్బందులు పడుతున్నారు. రాజంపేట మండలం బస్వన్నపల్లిలో బోర్లు పడవు. దీంతో బావులే ఆధారం. ఒక బావిలో 15 మోటార్లు ఏర్పాటు చేసుకుని నీటిని తవ్వుకుంటున్నారు. సదాశివనగర్ మండలం అమర్లబండలో దశాబ్దాలుగా నీటి సమస్య తీరడం లేదు. గ్రామ శివారు నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. పెద్దకొడప్‌గల్ మండలంలోని కుబ్యానాయక్ తండా, పోచారం తండా, సముందర్‌తాండాలలో ప్రజలు పొలాల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. పిట్లం మండలం అన్నారంలో కిందిగల్లీలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. బిచ్కుంద మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. ఎల్లారం తండాలో ప్రజలు వ్యవసాయ బోర్ల వద్ద నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. బాన్సువాడ మండలంలోని కాద్లాపూర్‌లో నీటి కష్టాలు పెరిగాయి. నల్లాల ద్వారా రాకపోవడంతో బోర్ల వద్ద నుంచి తెచ్చుకుంటున్నారు. రాజారాం దుబ్బ, అవాస్‌పల్లి ప్రాంతాల్లోనూ నీటికి కష్టాలు ఎదుర్కొంటున్నారు.



కాద్లాపూర్‌లో కావడిపై నీళ్లు మోసుకెళ్తున్న గ్రామస్తులు





సుల్తాన్‌పేట్ శివారులోని బోరుబావి వద్ద..

పైప్‌లైన్ పనులు పూర్తయ్యేదెప్పుడో...

ఎస్సారెస్పీ గ్రిడ్‌లో భాగమైన కామారెడ్డి ప్రాంతానికి నీటిని అందించే పైప్‌లైన్ పగిలిపోయి ఒక్కోసారి వారం, పది రోజులు నీటి సరఫరా నిలిచిపోతోంది. ఈ నేపథ్యంలో సమస్య పరిష్కారం కోసం రూ.2 వందల కోట్లతో కొత్త పైపులైన్ పనులు చేపట్టారు. వేసవి సీజన్ వచ్చినా పనులు పూర్తి కాలేదు. అలాగే అమృత్–2 పథకం ద్వారా జిల్లా కేంద్రంలో పనులు నడుస్తున్నాయి. జిల్లా కేంద్రంలో భూగర్భ జలమట్టం పడిపోయి ఇళ్లల్లో బోర్లు ఎత్తిపోతున్నాయి. దీంతో గల్లీ వాసులంతా ఏకమై సొంతంగా తలా కొంత డబ్బు జమ చేసుకుని వెయ్యి నుంచి 15 వందల అడుగుల లోతు వరకు బోర్లు తవ్వించుకుంటున్నారు. నీరు పడితే ఎలాగోలా సర్దుకునే పరిస్థితి.. లేదంటే ట్యాంకులతో నీరు కొనాల్సిందే. పట్టణంలోని అశోక్‌నగర్, శ్రీరాంనగర్, ఎన్జీవోస్ కాలనీ, రుక్మిణికుంట, కాకతీయనగర్ తదితర ప్రాంతాల్లో నీటి కష్టాలు మొదలయ్యాయి. ట్యాంకర్‌కు రూ.5 వందలు వెచ్చించి నీటిని కొనుగోలు చేస్తున్నారు. నీటి సమస్య ఎదురవుతుందని తెలిసి కూడా పైప్‌లైన్ పనులు పూర్తి చేయకపోవడంతో ఈసారి కూడా ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. గతంలో రోజు విడిచి రోజు నీరు సరఫరా అయ్యేది. ఇప్పుడు మూడు, నాలుగు రోజులకోసారి కూడా నీరు రావడం లేదు.

ఏ ఊరికి వెళ్లినా..

జిల్లాలో ఏ ఊరికి వెళ్లినా నీటి సమస్య కనబడుతోంది. మిషన్ భగీరథ నీరు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు నిలిచిపోతుందో తెలియని పరిస్థితి ఉంది. ఎస్సారెస్పీ గ్రిడ్ ద్వారా కామారెడ్డి ప్రాంతంలోని కామారెడ్డి, సదాశివనగర్, తాడ్వాయి, మాచారెడ్డి, రామారెడ్డి, బీబీపేట, భిక్కనూరు, రాజంపేట, దోమకొండ మండలాలకు నీటిని అందిస్తుండగా, సింగూరు గ్రిడ్ నుంచి ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, లింగంపేట, జుక్కల్, మద్నూర్, పెద్దకొడప్‌గల్, పిట్లం, బిచ్కుంద, జోంగ్లీ, మహ్మద్‌నగర్, బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ తదితర మండలాలకు నీటిని సరఫరా చేస్తారు. రెండు గ్రిడ్ల పరిధిలో చాలాచోట్ల పైప్‌లైన్ల సమస్య నీటి సరఫరాకు ఆటంకంగా మారుతోంది. రికార్డుల్లో మాత్రం అన్ని ఆవాసాలకు నీరు సరఫరా అవుతుందని చెబుతున్నా ఇప్పటికీ మిషన్ భగీరథ నీరు చేరని గ్రామాలెన్నో ఉన్నాయి.

మోటార్లు, ట్యాంకర్ల నిర్వహణ భారం...

పంచాయతీలకు నిధులు రాక, ఇప్పటికే రూ.లక్షలు అప్పులు తెచ్చి పెట్టిన కార్యదర్శులు బోర్ల నిర్వహణ, ట్యాంకర్లకు డీజిల్ తీసుకురావడం తమతో కాదని చేతులెత్తేస్తున్నారు. దీంతో పల్లెల్లో నీటి కష్టాలు మరింత పెరుగుతున్నాయి. గ్రామాలకు ప్రత్యేక అధికారులున్నా, వారు పర్యవేక్షణ మాత్రమే చేస్తున్నారు. డబ్బులు కార్యదర్శులే సర్దుబాటు చేయాల్సి వస్తోంది. దాదాపు ప్రతి కార్యదర్శి రూ. లక్ష నుంచి రూ.5 లక్షల వరకు అప్పులు చేసి మరీ పంచాయతీలను నెట్టుకువస్తున్నారు. తాగునీటి సమస్య పెరుగుతుండడంతో బోర్లు, మోటార్లు, ట్యాంకర్ల నిర్వహణకు డబ్బులు ఎక్కడి నుంచి తేవాలో తెలియక సతమతమవుతున్నారు. నీటి సమస్య పరిష్కారానికి నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.



వ్యవసాయ బావినుంచి నీటిని తెచ్చుకుంటున్న సోమ్లానాయక్‌తండావాసులు

సమాజ పరివర్తనకు 'సంఘ్' కృషి

- ధర్మ రక్షణ కోసం శక్తిమంతులుగా తయారవ్వాలి
- దక్షిణ మధ్య క్షేత్ర ధర్మజాగరణ ప్రముఖ్ అమర లింగన్న
- ఘనంగా ఇందూరు నగర శాఖల సమ్మేళనం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉంటేనే హిందూ సమాజానికి శ్రేయస్సు అని, సమాజ పరివర్తనే స్వయం సేవక్‌ల బాధ్యత అని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ దక్షిణ మధ్య క్షేత్ర ధర్మజాగరణ ప్రముఖ్ అమర లింగన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో ఆదివారం ఇందూరు నగర శాఖ ఆధ్వర్యంలో 56 శాఖల సంగమం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రధాన వక్తగా లింగన్న హాజరై ప్రసంగించారు. కుటుంబ వ్యవస్థ మనచేతిలోనే ఉందని, కుటుంబం నుంచే భావి పౌరులకు జీవన విలువలు తెలపాలని అన్నారు. హిందూ సమాజాన్ని, సనాతన ధర్మాన్ని కాపాడేందుకు ఉద్భవించిన కలియుగ ప్రత్యేక అవతారం ఆర్‌ఎస్‌ఎస్ అన్నారు. ధర్మాన్ని కాపాడుకోవాలంటే శక్తిమంతంగా తయారు కావాలని, హిందువులందరూ సంఘటితంగా ఉంటేనే శక్తి సముపార్జన సాధ్యమవుతుందని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న అమర లింగన్న

భారతదేశంలో బ్రిటిష్ వాడు సృష్టించిన హిందువుల్లోని ఓ వర్గం విభజనవాదం చేస్తోందని విమర్శించారు. కమ్యూనిస్టులు చీడపురుగుల్లా తయారయ్యారని, అన్నిమతాలు సమానమని చెబుతూనే మతమార్పిడులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. హిందువులను మైనారిటీలుగా చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. గిరిజనులు, బంజారాలు, లింగాయత్‌లలో తాము హిందువులం కాదనే భావనను సృష్టిస్తున్నారన్నారు. ఇలాంటి కుట్రలకు ఫండింగ్ చేస్తున్న దొంగలెవరో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు.



ప్రార్థన చేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

బానిసత్వంలోకి నెట్టారు..

మహాపురుషులకు కొదువ లేని భారతదేశం కొందరి స్వార్థం, కుట్రల కారణంగా ఆత్మన్యూనత, అనైక్యతలకులోనై బానిసత్వంలోకి నెట్టబడిందని అమర లింగన్న ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో డాక్టర్ హెడ్గేవార్ భారత్‌ను మళ్లీ గురుస్థానంలోకి తీసుకొచ్చేందుకు స్వాతంత్రోద్యమం చేస్తూనే ఆర్‌ఎస్‌ఎస్‌ను స్థాపించారన్నారు. హిందువుల్లో సమైక్యత నిర్మాణం కోసం కృషి చేశారని, ప్రతిరోజూ హిందువులు కలిసేలా సఫలపూరిత కార్యపద్ధతి నెలకొల్పారన్నారు. సమయపాలన, ఆజ్ఞాపాలన విషయమై పుస్తకాలు రాయలేదని, హెడ్గేవార్ ఆచరించి చూపారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ నగర కార్యవాహ అర్గుల సత్యం, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి తోపాటు స్వయం సేవక్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కేటీఆర్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

- డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు
- జిల్లావ్యాప్తంగా కేటీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మల దహనం

కామారెడ్డి టౌన్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, జగదీశ్‌రెడ్డిల శాసనసభ సభ్యత్వాలను రద్దు చేయాలని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు. స్పీకర్‌పై వారు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఆదివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేశారు. జిల్లాకేంద్రంలోని ఇందిరా చౌక్ వద్ద కేటీఆర్, జగదీశ్‌రెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పండ్ల రాజు, నాయకులు శ్రీనివాస్, షేరు, అంజాద్, ప్రసాద్, రవి, గణేష్, నర్సింలు, మహేష్, గంగాధర్ పాల్గొన్నారు.



జిల్లాకేంద్రంలో కేటీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టి బొమ్మలు దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

క్లుప్తంగా

సాహిత్యంలో రాణిస్తున్న చుక్కాపూర్‌వాసి


కవయిత్రి పద్మావతి

మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ గ్రామానికి చెందిన కందాళ పద్మావతి వచన కవితలు, కథనాలు రాసి సాహితీరంగంలో రాణిస్తున్నారు. ఆమె రచించిన 55 కవితలతో కూడిన 'హది స్వప్నం' అనే పుస్తకాన్ని ఇటీవల హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో ఆవిష్కరించారు. పద్మావతికి చుక్కాపూర్ గ్రామానికి చెందిన వేల్పూరి నరసింహచారితో వివాహమైంది. పదో తరగతి నుంచే ఆమెకు చిన్న కవితలు రాయడం ప్రారంభించింది. పెళ్లయిన 20 ఏళ్లకు కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో ఇంటర్, డిగ్రీ, తెలుగు పండిట్ కోర్సు పూర్తి చేసి ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ రచనపై దృష్టి సారించింది. సామాజిక స్పృహ, సమానత్వం, మహిళాభ్యుదయం భావాలతో కవితలు రాస్తుంది. ఆమె రాసిన కవితలకు పలు బహుమతులతో పాటు ఎన్నో అవార్డులు లభించాయి. స్వర్గీయ సినారె చేతుల మీదుగా పలు ప్రశంసలు, అవార్డులు అందుకున్నారు. పద్మావతి అందరి మన్ననలను పొందుతోంది.

డ్రెయినేజీ పాలవుతున్న సాగునీరు


వృథాగా పోతున్న సాగు నీరు

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని నాచుపల్లి గ్రామంలో సాగు నీరు మురికి కాలువ పాలవుతుంది. పలు చోట్ల సాగు నీరు అందక పంట పొలాలు బీటలు వారుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి వృథాగా పోతున్న నీటిని అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

ఎమ్మార్పీఎస్ నిరసనలు

ఎల్లారెడ్డిరూరల్ : ఎస్సీ వర్గీకరణలో భాగంగా జనాభా ప్రాతిపాదికన రిజర్వేషన్లు అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. పట్టణంలోని తెలంగాణ తల్లి ప్రాంగణంలో నిర్వహిస్తున్న దీక్షలు ఆదివారంతో ఐదో రోజుకు చేరాయి. రిజర్వేషన్లు అమలు అనంతరం ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పద్మారావు, శివానందం, సామెల్ తదితరులున్నారు.

ఎమ్మెల్యే సహకారంతో బోరు మోటారు


తిప్పాపూర్‌లో బోరుమోటార్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్ గ్రామంలోని నాలుగో వార్డులో ఎమ్మెల్యే కేవీఆర్ సహకారంతో నీటి ఎద్దడిని నివారించినట్లు బీజేవైఎం జిల్లాకార్యదర్శి పైడి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే నిధులతో బోరును తవ్వించి, మోటారు పంపును బిగింపజేశామన్నారు. ఆదివారం పూజ కార్యక్రమాలను నిర్వహించి బోరుమోటర్‌ను ప్రారంభించారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోరా..?

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని కాకతీయ నగర్ 35వ వార్డు రోడ్డు నంబర్ -8లో మురికి కాలువను మట్టితో మూసివేశారు. దీంతో ఖాళీ ప్లాట్లలోకి మురుగునీరు చేరి దోమలు వస్తున్నాయని, దుర్గంధం వ్యాపిస్తున్నట్టు గతనెల 22న మున్సిపల్‌లో కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. అధికారులు పట్టించుకోవడంలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు ఇసుక డంపుల వేలం

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మర్పల్లి గ్రామంలో సీజ్ చేసిన ఇసుక డంపులకు సోమవారం వేలంపాట నిర్వహించనున్నట్లు తహసీల్దార్ భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి సంబంధించిన వ్యక్తులు వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

సిబ్బందిపై నిఘా పెట్టేదెవరు?

- నిజామాబాద్ బల్దియాలో ఎంహెచ్‌వో పోస్టు ఖాళీ
- రెండేళ్లుగా భర్తీ చేయని అధికారులు
- నియంత్రణ లేక ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది



బల్దియా కార్యాలయం

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అతి కీలకమైన మున్సిపల్ హెల్త్ ఆఫీసర్(ఎంహెచ్‌వో) పోస్టు రెండేళ్లుగా ఖాళీగా ఉంది. దీంతో కిందిస్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో నగరంలో పారిశుధ్య పనులు, తనిఖీలు సరిగా చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

నగరంలోని ఐదు జోన్లకు గాను ఐదుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లున్నారు.వీరిపై శానిటరీ సూపర్‌వైజర్, ఆయనపై ఎంహెచ్‌వో పర్యవేక్షణ ఉండాలి. కానీ పారిశుధ్య పనులు కేవలం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మాత్రమే చూస్తున్నారు. కానీ పైఅధికారి లేకపోవడంతో వారు విధుల్లో తీవ్ర అలసత్వం వహిస్తున్నారు. నగరంలో ప్రతిరోజు 300 మెట్రిక్ టన్నుల చెత్త తయారవుతోంది. ఈ చెత్తను ఇంటింటి నుంచి సేకరించడం, మున్సిపల్ వాహనాల్లో తరలించడం, కూడళ్లలో వేసిన చెత్తను తొలగించడం వంటి నిత్య ప్రక్రియలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. డ్రైనేజీలు చెత్త, మురికినీటితో నిండిపోయాయి. అలాగే రెగ్యులర్ ఉద్యోగులు రాకున్నా వారికి హాజరువేసి వారి వద్దనుంచి నెలనెలా వసూళ్లకు పాల్పడుతున్నారు. అయినా వీరిపై అధికారులు నిఘా ఉంచడం లేదు.

తనిఖీలు కరువు..

నగరంలో 200 వరకు ఫుట్‌పాత్‌ల మీదనే హోటళ్లు, దుకాణాలు నిర్వహిస్తున్నారు. నాణ్యతలేని సరుకులు వాడటంతోపాటు అపరిశుభ్రంగా ఉన్న స్థలాల్లో తినుబండారాలు విక్రయించడంతో నగరవాసులు అనారోగ్యం పాలవుతున్నారు. అయినా వీరిపై ఎలాంటి తనిఖీలు లేవు. టిఫిన్‌సెంటర్ల వద్ద ప్రతీనెల సిబ్బంది మాముళ్లు వసూలు చేసినా పట్టించుకునే వారు లేదు. పాలిథిన్ బ్యాగ్‌లపై నిషేదం ఉన్నా కిరాణదుకాణాలు, టిఫిన్‌సెంటర్లు, కూరగాయలు, పండ్ల వర్తకుల వద్ద తనిఖీలు చేయడం లేదు. కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ట్రేడ్ లైసెన్స్‌లు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేస్తున్నారు. ఎంహెచ్‌వో పోస్టు భర్తీ చేస్తే బల్దియా సిబ్బందిపై నిఘా ఉంచి, అందరూ సక్రమంగా విధుల నిర్వహించేలా చర్యలు చేపట్టే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బల్దియాలో ఎంహెచ్‌వో పోస్టును భర్తీ చేయాలని పలువురు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



మా ఇంటిముందు డ్రెయినేజీలు నిండిపోయి మురికినీరు రోడ్డుమీద పారుతోంది. మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పనులు చేయడం లేదు. నగరంలో పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఉన్నతాధికారులు సంబంధిత అధికారిని నియమిస్తే సమస్యలను పరిష్కరించే అవకాశం ఉంది. -శ్రీనివాస్, జవహర్ రోడ్డు వాసి

త్వరలో నియమిస్తాం



బల్దియాలో చాలా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎంహెచ్‌వో పోస్టు కూడా ఖాళీగా ఉంది. సీడీఎంఏకు తెలియజేశాం. డిప్యూటీ కమిషనర్ అదనపు బాధ్యతలు చూస్తున్నారు. ప్రతిరోజు ఉదయం నేను తనిఖీలు నిర్వహిస్తున్న. నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బందిని హెచ్చరిస్తున్నా. -దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

పేదల సొంతింటి కల నెరవేరుతోంది

- ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం భూమి పూజ


గుండెకల్లూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

బిచ్కుంద(జుక్కల్): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదలకు సొంతింటి కల నెరవేరుతుందని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. ఆదివారం గుండెకల్లూర్‌లో ఎమ్మెల్యే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం మొగ్గువేసి పనులు ప్రారంభించారు. అలాగే సీసీ రోడ్డు పనులు, కొత్త రేషన్ షాపును ప్రారంభించారు. లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తానని నియోజక వర్గంలో ఒక్కటీ ఇవ్వలేదన్నారు. జుక్కల్ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తానన్నారు. దశల వారిగా అన్ని రంగాలలో అభివృద్ధి చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విఠల్‌రెడ్డి, రాజు పటేల్, దడ్గి నాగ్‌నాథ్, పార్టీ అధ్యక్షుడు గంగాధర్, నాగ్‌నాథ్ పటేల్, తహసీల్దార్ నరేష్ పాల్గొన్నారు.


జుక్కల్ లో ..

ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం

మద్నూర్(జుక్కల్): మండలంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం రూ. 50 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత జుక్కల్ నియోజకవర్గ రూపురేఖలు మారుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు దరాస్ సాయిలు, నాయకులు సాయి పటేల్, హన్మండ్లు స్వామి, ప్రజ్ఞకుమార్ తదితరులున్నారు.

సీసీ రోడ్లతో గ్రామాలకు మహర్దశ

నిజంసాగర్ (జుక్కల్): సిమెంట్ రోడ్ల నిర్మాణంతో గిరిజన తండాలు, గ్రామ పంచాయతీలు మహర్దశను సంతరించుకుంటున్నాయని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. ఆదివారం జుక్కల్ మండల కేంద్రంలో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామం, గిరిజన తండాలకు సిమెంట్ రోడ్ల నిర్మాణం కోసం రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్ దేశాయ్, సాయా గౌడ్ తదితరులున్నారు.

ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి కృషి చేయాలి

బీబీపేట: రాష్ట్రంలో ఉన్నటువంటి ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను ఇస్సానగర్ గ్రామ మాజీ సర్పంచ్ పొట్టిగారి పొట్టయ్య, గ్రామ నేతలు కలిసి కోరారు. అనంతరం వెంకటయ్యను వారు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలో ప్రభుత్వ అధికారుల వద్ద ఎస్సీ, ఎస్టీ మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులకు ప్రభుత్వ ఆఫీసులలో గుర్తింపు లేదని వారు ఆయనకు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, బాబు, జోగు సురేష్, ప్రశాంత్, చిన్న బాబు, కమలాకర్ తదితరులున్నారు.


బక్కి వెంకటయ్యను కలిసిన నేతలు

28 ఏళ్లకు కలుసుకున్న మిత్రులు


దేవునిపల్లిలో సమావేశమైన జెడ్పీహెచ్ఎస్ 1997-98 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

కామారెడ్డి రూరల్: చిన్నతనంలో కలిసి చదువుకున్న మిత్రులు 28ఏళ్ల తర్వాత కలుసుకున్న అపూర్వ ఘట్టం మండలంలోని దేవునిపల్లిలో చోటుచేసుకుంది. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఏళ్ల తర్వాత కలుసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం వారంతా సహపంక్తి భోజనాలు చేశారు.

పడకల్‌లో 25 ఏళ్ల తర్వాత..

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999-2000 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు స్థానిక మున్నూరుకాపు సంఘ భవనంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులు ఒకరినొకరు కలుసుకొని చిన్ననాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అలాగే అదే పాఠశాలకు చెందిన 2011-12 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు బడిలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి టీచర్లు గోపాలకృష్ణ, స్వామి, జెడ్పి సింధూర, ప్రసాద్, మమతలను పూర్వ విద్యార్థులు సత్కరించారు.


పడకల్ జెడ్పీహెచ్ఎస్ 1999-2000 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ టోర్నీకి ఎంపికైన శరత్ చంద్ర


శరత్ చంద్ర

భిక్కనూరు: జమ్ముకాశ్మీర్‌లో వచ్చే నెలలో జరుగనున్న అండర్-14 ఎస్‌బీఎఫ్ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్రం నుంచి భిక్కనూరుకు చెందిన కైరంకొండ శరత్‌చంద్ర ఎంపికయ్యాడని ఆదివారం కుటుంబ సభ్యులు తెలిపారు.వనపర్తి జిల్లా కేంద్రంలో జరుగుతున్న ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపిన 11 మంది క్రీడాకారులను జాతీయ స్థాయి ఫుట్‌బాల్ టోర్నీకి ఎంపిక చేశారు.శరత్‌చంద్ర మెదక్ జిల్లా ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఈసందర్భంగా శరత్‌చంద్రను పలువురు అభినందించారు.

జోరుగా పంట నూర్పిళ్లు




బాన్సువాడ రూరల్ : మండలంలోని మెట్ట ప్రాంతాలైన గట్టుమీది గ్రామాల్లో జోరుగా పంట నూర్పిళ్లు సాగుతున్నాయి. సాగునీటి సౌకర్యం ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఈప్రాంతవాసులు మొక్కజొన్న, జొన్న తదితర పంటలు సాగు చేశారు. ముందస్తుగా వేసిన మొక్కజొన్న, జొన్న కోతకు రావడంతో నూర్పిడి పనులు సాగుతున్నాయి. వీటితో పాటు పలుచోట్ల రైతులు పుచ్చకాయ, మునగ తదితర పంటలు సాగు చేశారు.

క్రైం కార్నర్

బైక్, కంటెయినర్‌ను ఢీకొన్న కారు

- ఒకరి మృతి, నలుగురికి గాయాలు


కంటెయినర్‌ను ఢీకొన్న కారు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై ఓ కారు అతివేగంగా వచ్చి బైక్, కంటెయినర్‌ను ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా నలుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఇషాద్, కర్ణల్ ఉపాధి నిమిత్తం భీమ్‌గల్‌కు వచ్చారు. తమ స్నేహితులు ఆర్మూర్ నుంచి యూపీకి వెళుతుండగా కలవాలనుకున్నారు. దీంతో శనివారం రాత్రి ఇద్దరు కలిసి బైక్‌పై బయలుదేరగా, మార్గమధ్యలో పెర్కిట్‌లో ఉన్న మరో స్నేహితుడు మనీష్‌ను ఎక్కించుకుని వెళ్లారు. ఆర్మూర్‌లోని హైవే పైగల మహిళా ప్రాంగణం వద్ద వీరి బైక్‌ను ఓ కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. అనంతరం ఆగిఉన్న కంటెయినర్‌ను ఢీకొట్టింది. ఈఘటనలో ఇషాద్ అక్కడికక్కడే మృతి చెందగా బైక్‌పై ఉన్న మరో ఇద్దరు కర్ణల్, మనీష్, కారులోని రాహుల్, గణేష్‌లు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. మృతదేహాన్ని, క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.మృతుడి బావ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మాచారెడ్డి: మండలకేంద్రంలోని మాచారెడ్డి-కామారెడ్డి రహదారిపై గల పెట్రోల్ బంక్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. మాచారెడ్డి మండల కేంద్రానికి చెందిన నర్సయ్య, నారాయణలు మాచారెడ్డి చౌరస్తా నుంచి టీవీఎస్ మోపెడ్‌పై వెళుతుండగా, పెట్రోల్ పంపు వద్ద వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో వారికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు స్పందించి వెంటనే వారిని చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

కోతుల దాడిలో ఒకరికి ..

ఆర్మూర్ టౌన్: పెర్కిట్ ఆర్టీసీ కాలనీలో ఒడ్డాజీ జనార్ధన్ అనే వ్యక్తిపై ఆదివారం కోతులు దాడి చేయడంతో గాయపడ్డాడు.ఇంటి ముందు కూర్చున్న సమయంలో కోతులు దాడి చేయడంతో ఆయనకు గాయాలు అయ్యాయి. స్థానికులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం ఆర్మూర్ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ మందులు లేకపోవడంతో ఆయనను జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


మృతదేహాన్ని బయటకు తీస్తున్న సిబ్బంది

బాన్సువాడ రూరల్: నిజాంసాగర్ ప్రధాన కాలువలో గల్లంతైన సంగ్రాం తండాకు చెందిన యువకుడు సిద్ధార్థ (19) మృతదేహం ఆదివారం లభ్యమైంది. బాన్సువాడ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. శనివారం సిద్దార్థ, అన్న వరుసయ్యే రాజు ఇద్దరు కలిసి బైక్‌పై తండాకు వస్తుండగా మార్గమధ్యలో కాలువ వద్ద ఆగారు. రాజు కాలువలోకి దిగి కాళ్లుచేతులు కడుగుతుండగా నీటిలో పడిపోయాడు. రాజును రక్షించే క్రమంలో సిద్దార్థ కాలువలో జారిపోగ స్థానికులు గమనించిన రాజును రక్షించారు. కానీ సిద్దార్థ నీటిప్రవాహంలో కొట్టుకుపోయి మృతిచెందినట్లు తండాపెద్దలు సంగ్రాం నాయక్ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

- గోదావరిలో దూకుతుండగా అడ్డుకున్న పోలీసులు


యువకుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

నవీపేట: ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించగా పోలీసులు అడ్డుకొని కాపాడారు. వివరాలు ఇలా.. జిల్లా కేంద్రంలోని శివాజీనగర్ కాలనీకి చెందిన బయ్యాని వంశీకృష్ణ(30) వడ్రంగి పని చేస్తూ జీవించేవాడు. ఇటీవల ఇంట్లో కుటుంబ సభ్యులతో జరిగిన ఘర్షణతో అతడు తీవ్ర మనస్థాపం చెందాడు. ఆదివారం గోదావరి నదిలో దూకి చనిపోతానని కుటుంబ సభ్యులను బెదిరించి ఇంట్లోను వెళ్లిపోయాడు. ఈ విషయాన్ని వారు నవీపేట పోలీసులకు తెలిపారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు మండలంలోని యంచ శివారులోగల గోదావరి బ్రిడ్జిపై నడుచుకుంటూ నదిలో దూకేందుకు యత్నించిన యువకుడిని అడ్డుకున్నారు. కౌన్సెలింగ్ చేసి అతడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

మక్కల ట్రాక్టర్ బోల్తా



బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన రైతు అమ్మక్కపేట్ కిషన్ మక్కల లోడ్‌తో ట్రాక్టర్‌ను చేనులో నుంచి కల్లాం వద్దకు తీసుకొస్తుండగా మార్గమధ్యలో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో రైతుకు ఎలాంటి గాయాలు కాలేదు. కానీ మక్కలు వరి పొలంలో పడటంతో నీటిపాలయ్యాయి. పొక్లెయిన్ సహాయంతో ట్రాక్టర్‌ను పంట పొలాల నుంచి బయటకు తీశారు.

ఇసుక టిప్పర్, పొక్లెయిన్ సీజ్



ఆర్మూర్‌టౌన్: ఆలూర్ మండలం దేగాం గ్రామ శివారులోని వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ ఆదివారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించగా పొక్లెయిన్‌తోపాటు టిప్పర్‌ను సీజ్ చేశామన్నారు. అలాగే ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు.

‘ఒకే దేశం-ఒకే ఎన్నిక’ చరిత్రాత్మక నిర్ణయం

సుభాష్‌నగర్: దేశ అభివృద్ధి కోసం ప్రధాని నరేంద్ర మోదీ చేపడుతున్న సంస్కరణల్లో మరో చరిత్రాత్మక నిర్ణయం 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' అని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం 'వన్ నేషన్-వన్ ఎలక్షన్' వర్క్‌షాప్ ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ధన్‌పాల్ మాట్లాడుతూ.. ప్రతిసారి ఎన్నికల కోసం రూ.వేల కోట్ల ప్రజాధనం ఖర్చవుతుందన్నారు. తరచూ జరిగే ఎన్నికల వల్ల అభివృద్ధి పనులకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. 'వన్ నేషన్-వన్ ఎలక్షన్' ద్వారా ప్రజాధనం ఆదా అవడంతోపాటు అభివృద్ధి పనులు వేగంగా అమలు చేయవచ్చన్నారు. ఎన్నికలు ఒకేసారి జరగడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం మెరుగుపడుతుందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, జిల్లా ఉపాధ్యక్షుడు నాగోళ్ల లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

తండ్రిని హతమార్చిన తనయుడు

- సహకరించిన తల్లి
- డబ్బులు ఇవ్వడం లేదని ఘాతుకానికి పాల్పడ్డ నిందితులు


మల్లయ్య (ఫైల్)

ధర్పల్లి: తన అవసరాలకు డబ్బులు ఇవ్వడం లేదని కన్న తండ్రిని కొడుకు హతమార్చిన ఘటన ధర్పల్లి మండలంలో చోటుచేసుకుంది. తల్లి సైతం కొడుకుకు సహకరించడంతో పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ధర్పల్లి సీఐ భిక్షపతి, ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని హొన్నాజీపేట్ గ్రామానికి చెందిన పాలెం చిన్న మల్లయ్య (65)కు భార్య లక్ష్మి, కొడుకు మధు ఉన్నారు. మల్లయ్య తనకున్న భూమిలో వ్యవసాయం చేసుకుంటూ, ఆవుల కాపరిగా జీవనం కొనసాగిస్తున్నారు. కొడుకు వివాహం జరుగగా, పొలం పనులు చేసుకుంటు ఉండేవాడు. డబ్బుల విషయంలో మల్లయ్యతో లక్ష్మి, కొడుకు మధు తరచూ గొడవపడేవారు. శనివారం రాత్రి గ్రామంలో ని ఒక కిరాణా దుకాణం వద్ద తనకు డబ్బులు కావాలని కొడుకు, తండ్రితో గొడవకు దిగగా, స్థానికులు సర్దిచెప్పారు. కానీ కోపం పెంచుకున్న కొడుకు తండ్రిని చంపాలని నిర్ణయించుకొని, బీరు సీసాతో ఇంటికి వెళ్లాడు. గొడవ విషయాన్ని తల్లికి చెప్పడంతో ఇద్దరు కలిసి మల్లయ్యతో గొడవకు దిగారు. తల్లి, కొడుకు ఇద్దరు కలిసి మల్లయ్య గొంతు పట్టుకొని కిందకు పడేశారు. వెంటనే మధు, మల్లయ్యపై సీసాతో దాడి చేశారు ఈ క్రమంలో మల్లయ్య తలకు గాయమై, రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారాన్ని అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని నిందితులను ఆదివారం రిమాండ్ కు తరలించారు.

రెండు ఆలయాల్లో చోరీ



వర్ని: మండలంలోని జలాల్పూర్ గ్రామంలోగల మల్లికార్జునస్వామి, కృష్ణ దేవాలయంలో గుర్తుతెలియని వ్యక్తి శనివారం రాత్రి చోరీకి పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం ఆలయానికి వచ్చిన భక్తులు చోరీని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దుండగుడు ఐదు తులాల బంగారం, 25 తులాల వెండి, హుండీలోని నగదును ఎత్తుకెళ్లాడు. సీసీ కెమెరా ఫుటేజీలో నిందితుడి దృశ్యం రికార్డయింది. గ్రామస్తులు వర్ని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్..

రుద్రూర్: కోటగిరి మండలం కొత్తపల్లి శివారులో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి గుర్తుతెలియని దుండగులు కాపర్ కాయిల్స్‌ను ఎత్తుకెళ్లారు. పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు కిందపడవేసి అందులోని కాపర్ కాయిల్స్ దొంగిలించారు. ఘటనపై విద్యుత్ అధికారులకు సమాచారం అందించినట్టు రైతులు ఆదివారం తెలిపారు.

పోతంగల్‌లో బైక్..

రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రంలో బైక్‌ను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. వివరాలు ఇలా.. పోతంగల్‌లోని ఆబాది బీసీ కాలనీలోగల కిరాణ షాపు వద్ద రెండు రోజుల క్రితం ఇందూర్ గంగాధర్ తన బైక్‌ను నిలిపాడు. దుకాణంలోకి వెళ్లి వచ్చేసరికి దుండగులు బైక్‌ను చోరీ చేశారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు ఆదివారం తెలిపారు.

మహిళను నమ్మించి నగలు అపహరణ

నిజాంసాగర్(జుక్కల్): ఓ మహిళను గుర్తుతెలియని ఆటో డ్రైవర్ నమ్మించి నగలు ఎత్తుకు వెళ్లిన ఘటన మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. నిజాంసాగర్ ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాలు ఇలా.. సంగారెడ్డి జిల్లా మార్డి గ్రామానికి చెందిన మ్యాతరి భూమవ్వ శనివారం సాయంత్రం నిజాంసాగర్ బస్టాండ్‌కు వచ్చింది. అచ్చంపేట గ్రామంలోని కూతురి ఇంటికి వెళ్లడానికి బస్టాండ్ వద్ద రోడ్డుపై నిల్చుంది. అదే సమయంలో అచ్చంపేట వైపు వెళ్తున్న ఓ ఆటోలో మరో మహిళ ఉండగా భూమవ్వ సదరు ఆటో ఎక్కింది. అచ్చంపేట గ్రామం వైపు వెళ్లిన ఆటోను డ్రైవర్ మార్గమధ్యలో నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లాడు. అనంతరం భూమవ్వ మెడలో ఉన్న రెండు తులాల బంగారు ఆభరణాలు, 20తులాల వెండి ఆభరణాలను ఎత్తుకువెళ్లాడు. భూమవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శివకుమార్ ఆదివారం తెలిపారు.

చెరువులో పడి ఒకరి మృతి

కామారెడ్డి క్రైం: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన కామారెడ్డి మండలం తిమ్మక్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. లింగాయిపల్లి గ్రామానికి చెందిన దుమ్మల మల్లయ్య (50) శనివారం సాయంత్రం తన కులానికి చెందిన మహిళ చనిపోవడంతో అంత్యక్రియలకు కుటుంబంతో కలిసి తిమ్మక్‌పల్లికి వెళ్లారు. అంత్యక్రియలు పూర్తయ్యాక తిమ్మక్‌పల్లి చెరువులో అందరూ కలిసి స్నానాలకు దిగారు. ప్రమాదవశాత్తు మల్లయ్య నీట మునిగి చనిపోయాడు. స్థానికులు చాలాసేపు గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. సమాచారం అందుకున్న దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి భార్య శివవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు ఆదివారం తెలిపారు.